



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నర్సింగ్ కళాశాలలో సకల వసతులు కల్పిస్తాం

» కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మంగల్‌పల్లిలో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలలో వైద్య పరికరాలతోపాటు అన్ని సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మంగల్‌పల్లిలో భారత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఆరోగ్య దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా, ఇక్కడ జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో అనంతరెడ్డితో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నర్సింగ్ కళాశాలను ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. ఇక్కడ విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, తహసీల్దారు సునీతా రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

» కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏల ఆందోళన



రంగారెడ్డి అర్బన్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 3797 మంది 61 సంవత్సరాలు వయసు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చి దళిత, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని అధికారులు

చాలా వీక్

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు విధి నిర్వహణలో చాలా వీక్‌గా ఉన్నారని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పరిష్కారం కాని సమస్యలేవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా విజయోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారుల బాధ్యతగా పనిచేయాలని, క్రమ శిక్షణతో మెలగాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో 65 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 53 రెవెన్యూ 12 ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో సంగీత తదితరులున్నారు.

62 కిలోల గంజాయి పట్టివేత

» ఇద్దరి అరెస్టు

» వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి, మాస్కుతో ఉన్నవారు పట్టుబడిన నిందితులు

మహేశ్వరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 62 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.16లక్షలు ఉంటుందని తెలిపారు. డీసీపీ సునీతారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ మౌలానా, మహ్మద్ ముస్తఫా, చిట్టిబాబు, ప్రాణహిత నలుగురు ముఠాగా ఏర్పడి ఏపీ విశాఖపట్నం, తుని దగ్గరలోని తాళ్లపాలెం ప్రాంతం నుంచి గంజాయి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ ముఠాకు చిట్టిబాబు నేతృత్వం వహిస్తున్నాడు. ఈ క్రమంలో మహమ్మద్ మౌలానా, మహమ్మద్ ముస్తఫాలు శనివారం వాహనంలో తాళ్లపాలెం చేరుకున్నారు. అక్కడ రెండు లక్షల పదివేల రూపాయలు చెల్లించి 62కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దీనిని 30 పాకెట్లలో ప్యాకింగ్ చేసి వాహనం వెనకభాగంలో లోడ్ చేసుకున్నారు. నిజామాబాద్ చేరుకునేందుకు మిర్యాలగూడ మీదుగా దేవరకొండ, కల్వకుర్తి రూట్‌లో తుక్కుగూడ ఔటర్ రింగ్‌రోడ్ మీదుగా వస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మహేశ్వరం గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ వాహనాన్ని పోలీసులు ఆపారు. వాహనంలో సోదాలు నిర్వహించగా 30 ప్యాకెట్లలో ఉన్న 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహ్మద్ మౌలానా, మహ్మద్ ముస్తఫాలను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లు, రూ.10వేల నగదును సీజ్ చేసినట్లు డీసీపీ సునీతా రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మికాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా!

చేవెళ్ల, వికారాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు

రెండు చోట్ల ఆరుగురు దుర్మరణం

విషాదంలో ఆలూరు, నాన్‌చెరు గ్రామాలు

ఇబ్రహీంపట్నంలో పరువు హత్య

అక్కని నరికి చంపిన తమ్ముడు

మేడ్చల్ జిల్లా నారాయణ కళాశాలలో

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో మృత్యుఘోష



చేవెళ్లలో రైతులపైకి దూసుకెళ్లిన లారీ, రోదిస్తున్న మృతుడు కృష్ణ తల్లి

ఉమ్మడి జిల్లాలో సోమవారం రోడ్లు రక్తమోడాయి. వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. చేవెళ్లలో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న రైతులపైకి వేగంగా వచ్చిన లారీ దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు వదిలారు. వికారాబాద్ పట్టణంలో బైక్, బొలేరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో బొలేరో వాహనం ముందు ఉన్న బైక్‌పై తిరగబడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇబ్రహీంపట్నంలో కులాంతర వివాహం చేసుకుందని అక్కపై కోపం పెంచుకున్న తమ్ముడు వేట కొడవలితో నరికి చంపాడు. అలాగే మేడ్చల్ జిల్లా అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో మూత్రానికి, నీరు తాగేందుకు బయటకు పంపించకుండా వేధింపులకు గురిచేశారు. దీన్ని భరించలేని ఇంటర్ విద్యార్థి బెడ్‌షీట్‌తో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

రంగారెడ్డి అర్బన్/ చేవెళ్ల/ ఇబ్రహీంపట్నం/ వికారాబాద్/ఘట్‌కేసర్ రూరల్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు వస్తే.. లారీ రూపంలో ముగ్గురు రైతులతో పాటు కూరగాయలు కొనుక్కునేందుకు వచ్చిన ఒకరిని మాయదారి లారీ.. మృత్యువు రూపంలో ప్రాణాలను కబళించింది. చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర సంచలనం రేపింది. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు రైతులు అక్కడిక్కడే

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న నర్సింహ

వర్గీకరణను ఆపలేరు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ

చౌదరిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, కుట్రలు చేసినా ఎస్సీ వర్గీకరణను ఆపలేరని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ అన్నారు. కొందుర్గు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం ఉత్తుత్తిదేనని, వారి తాత ముత్తాతలు మళ్లా పుట్టినా ఎస్సీ వర్గీకరణ అమలును ఆపలేరన్నారు. కొందరు కేవలం మాలలను మభ్య పెడుతున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం న్యాయ పోరాటం చేసేవారే అంబేడ్కర్ వారసులన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.వెంకటయ్య, డి.శ్రీను, మల్లేష్, జోసఫ్, సిద్ధు శేఖర్, రాంచంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

నీటి పైప్‌లైన్లలో ఫ్లోరైడ్

కృష్ణా నీటితో బోరు నీరు కలిపి సరఫరా

పైపుల్లో పేరుకుపోయిన ఫ్లోరైడ్ గడ్డలు

నీటి సరఫరాలో అంతరాయం

ఇబ్బంది పడుతున్న ప్రజలు



10

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

ఆరు వేల రూపాయలు ఇవ్వాలి

సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్

ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ వద్ద రిలే దీక్ష



10

బాల్య వివాహాలు నేరం

మైనర్లకు పెళ్లి చేస్తే సమాచారమివ్వండి

చైల్డ్ మ్యారేజెస్ నిర్మూలనకు

ప్రతీఒక్కరు సహకరించాలి

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు



8

పేదల బియ్యం పక్కదారి

» మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి బస్తాల్లో ప్యాకింగ్

» సన్నబియ్యమని అమ్మకాలు

» సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు



యాచారం పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

యాచారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యాచారం మండల పరిధిలోని గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. కిలో బియ్యానికి రూ.10 నుంచి రూ.15 వరకు చెల్లించి వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ తతంగమంతా రాత్రివేళలో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతోంది. కడ్తాల్ మండలంలోని పల్లెచెల్క, తండావాసులు, ఆమనగల్లు, నగరంలోని పాతబస్తీకి చెందిన కొందరు వాహనాల్లో యాచారం మండలంలోని గ్రామాలకు వచ్చి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వీటిని నగరంలోని చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, నల్గొండ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.

ఈ రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేయించి ఆకర్షణీయమైన బస్తాల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. ఇలా ప్యాకింగ్ చేసినవి సన్నబియ్యం అని జనాలను విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు సేకరించిన రేషన్ బియ్యాన్ని కోళ్లఫాంలలో అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం.

మండలంలో 26 రేషన్ దుకాణాలు

యాచారం మండలంలో 26 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 441 అంత్యోదయ కార్డులకు 15,435కిలోల రేషన్ బియ్యం, 12,950 ఆహార భద్రతా కార్డులకు గాను 25,4040కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ బియ్యాన్ని మండలంలో 65శాతం మంది మాత్రమే వండుకుంటున్నారు. మిగతా వారు బయట అమ్ముకుంటున్నారు. రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, గత ఏడాది మూడు కేసులు నమోదు చేసి 15 క్వింటాళ్లు, ఈ ఏడాది 16 కేసులు నమోదు చేసి 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే చర్యలు

రేషన్ బియ్యం క్రయవిక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం తరలించే వాహనాలనూ సీజ్ చేస్తాం. ఈఏడాది ఇప్పటికే 80క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులకు అప్పగించాం.

- ఏ.నర్సింహారావు, యాచారం సీఐ





మంఖాల్ పారిశ్రామిక వాడ

కబళిస్తున్న కాలుష్యం

మంఖాల్ పారిశ్రామికవాడ నుంచి విషవాయువులు

మృత్యువాతపడుతున్న మూగజీవాలు

రోడ్లపై పారుతున్న రసాయన జలాలు

పట్టించుకోని సంబంధిత అధికారులు



రోడ్లపై ప్రవహిస్తున్న కాలుష్యపు నీరు

మహేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంఖాల్ పారిశ్రామిక వాడ నుంచి విడుదలవుతున్న విష వాయువులు, రసాయన జలాలతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రమాదకర స్థాయిలో విడుదలవుతున్న కాలుష్యం పంట పొలాలను పాడు చేస్తున్నాయి. మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మంఖాల్ పారిశ్రామిక వాడ 35 పరిశ్రమల వరకు ఉన్నాయి. వీటిల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో పచ్చని పంటలు రంగు మారి ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు కలుషితమై బోరు బావుల నుంచి గోధుమ రంగు నీరు వస్తుంది. ఆ నీటిని దేనికీ ఉపయోగించలేని పరిస్థితి ఉంది. దీంతో మొహబ్బత్‌నగర్, తుమ్మలూరు, సిరిగిరిపురం,

మిగతా 10వ పేజీలో...

బాల్య వివాహాలు చేస్తే సమాచారమివ్వండి



మేడిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే అంతకు ముందే తమకు సమాచారం ఇవ్వాలని, చైల్డ్ మ్యారేజెస్ నిర్మూలను ప్రజలు సహకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ప్రజలను కోరారు. సోమవారం రాత్రి యాచారంలో సీఐ ఎ.నర్సింహారావు, ఎస్సైలు మధు, సత్యనారాయణ తమ సిబ్బందితో ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ అడిగితే కాల్ కట్ చేయాలన్నారు. దుకాణాదారులు షాపులకు సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. మేడిపల్లిలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి పర్యటించారు. కొత్తవారు, అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కల్తీ, ఈగలు, దోమలు వాలిన ఆహారం తింటే రోగాలు కొనితెచ్చుకున్నట్లేనని ప్రజలకు సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు.

32వ రోజుకు మండల సాధన దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 32వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, గ్రామస్తులు కూర్చున్నారు. 9 పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ తీసుకోకుంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటయ్య, మోహన్, అంజన్‌రెడ్డి, మల్లయ్య, శేఖర్, అల్లావుద్దీన్, కృష్ణయ్య, నిరంజన్, కొండల్, అంజనేయులు, విజయ్, లక్ష్యానాయక్ పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా!

(7వ పేజీ తరువాయి)

దుర్మరణం చెందారు. మరో వ్యక్తిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషమ స్థితిలో ఉన్న అతడికి సీపీఆర్ నిర్వహించి బతికించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు అతన్ని కూడా మృత్యువు కాటేసింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి ప్రధాన కారణం లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త, ఓవర్ టేక్ చేయడంతో ప్రమాదం జరిగిందని ఘటన స్థలంలో చూసిన వ్యక్తులు చెబుతున్నారు. లారీ డ్రైవర్ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో జేసీబీ సహాయంతో కేబిన్‌ను తొలగించి ప్రాణాలతో బయటకు తీశారు. డ్రైవర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. ఆలూరు గ్రామంతో పాటు నాన్‌చెరులో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, ఆలూరు గ్రామానికి మొగులయ్య, ఆకుల పద్మమ్మ, నాన్‌చెరు గ్రామానికి చెందిన బాలమణి, మాలయాద్రి గాయపడ్డారు.



ఆలూరు వద్ద బాధితుల ఆందోళన

మృతుల కుటుంబాలను ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభారత్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు కార్తీక్‌రెడ్డి, దేశమొళ్ల అంజనేయులు, ఆర్డీవో చంద్రకళ, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ కిషన్, తహసీల్దారు కృష్ణ, సీఎం భూపాల్ శ్రీధర్, తదితరులు పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

కూరగాయలు పోసి వెళ్లే సమయంలో..

మృతుడు ఆలూరు గ్రామానికి చెందిన దామరగిద్ద కృష్ణ (22) డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి పరీక్ష కూడా రాశాడు. ఉద్యోగ వేటలో ఉన్న ఆ యువకుడు తల్లిదండ్రులు జంగయ్య, యాదమ్మకు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఆలూరు గేటు వద్ద కూరగాయాలు వేసి తిరుగు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే లారీ ఆ యువకుడిని మృత్యురూపంలో కబళించింది.

అక్కను నరికి హతమార్చిన తమ్ముడు

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. కులాంతర వివాహం చేసుకుందని అక్కను తమ్ముడు వేట కొడవలితో నరికి హతమార్చాడు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణికి ఎనిమిదేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం ఎంపీ పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఇటీవల అతనితో విడాకులు తీసుకుంది. అయితే నాగమణి, రాయపోల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ పెళ్లికాకముందు నుంచే ప్రేమించుకుంటున్నారు. నాగమణి విడాకులు అయిన తర్వాత గత నెల 10న వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరిది కులాంతర వివాహం కావడంతో నాగమణి సోదరుడు పరమేష్ తట్టుకోలేకపోయాడు. నాగమణి, శ్రీకాంత్ ఆదివారం రాయపోల్‌కు వచ్చారు. సోమవారం ఉదయం స్కూటీపై డ్యూటీకి వెళ్తున్న నాగమణిని కారుతో ఢీకొట్టాడు. కిందపడగానే వెంట తెచ్చుకున్న వేట కొడవలితో మెడపై నరికి చంపాడు. అయితే ఇది పరువు హత్య కాదు.. ఆస్తి తగాదా కారణమని స్థానికులు చెబుతున్నారు.

కారు, బొలేరో ఢీ.. బైక్‌పై ఉన్న ఇద్దరు మృతి



వికారాబాద్ రోడ్డు ప్రమాదంలో బొలేరో వాహనం బోల్తా పడటంతో కిందపడిన మద్యం బాక్సులు

వికారాబాద్ పట్టణం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రవీందర్(45) మెడికల్ కళాశాలలో కాంట్రాక్టర్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హేమంత్(25) అనంతగిరిలోని ఆయూష్ ఆసుపత్రి నిర్మాణం భవనంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి రేషన్ సరుకుల కోసం వికారాబాద్‌కు ఇద్దరు బైక్‌పై వెళ్తున్నారు. ఆ సమయంలో మద్యం లోడుతో వెళుతున్న బొలేరో వాహనం, కారు ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో బైక్‌పై బొలేరో వాహనం ఎగిరిపడింది. దీంతో బైక్‌పై ఉన్న రవీందర్, హేమంత్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. రవీందర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉండగా హేమంత్ భార్య ఉంది. బొలేరోలో ఉన్న మద్యం బాక్సులు పూర్తిగా కిందపడిపోయాయి. ఒక వైపు ప్రమాదంలో ప్రాణాలు పోతుంటే జనం మాత్రం మద్యం ఎత్తుకెళ్లేందుకు ఉత్సాహం చూపించారు. కొందరూ స్థానికులు వచ్చి మద్యం సీసాలను మరో వాహనంలో ఎక్కించడం కనిపించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్ కుమార్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



ఆందోళనకు దిగిన మృతుని తల్లిదండ్రులు, బంధువులు

యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండలం, పెద్దపలుగు తండాకు చెందిన బానోత్ జగన్నాథం నగరంలోని కుషాయిగూడ చక్రీపురంలో ఉంటున్నాడు. ఆయన చిన్న కుమారుడు బానోత్ తనుష్ నాయక్(16) అలియాస్ టింకు అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు విద్యార్థులను టీ బ్రేక్‌కు వదలడంతో టీ తాగి తిరిగి తరగతి గదులకు వెళ్తుండగా తనుష్ కనిపించ లేదు. దీంతో తోటి విద్యార్థులు వెతకడంతో బాత్‌రూంలో బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గుర్తించారు. వెంటనే అధ్యాపకులకు తెలిపారు. దీంతో కళాశాల యాజమాన్యం హుటాహుటిన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే తనుష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలిస్తారని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. కళాశాల గేట్లు తన్నుకొని లోపలికి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో గేటు ఎదుట బైఠాయించి కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతుడి బంధువు ఒకరు ఒంటిపై కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడకు విద్యార్థి సంఘాలు చేరుకొని కళాశాల వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, వేధింపుల కారణంగానే తనుష్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేదే లేదని బైఠాయించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి



మృతదేహాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రేపు హిందూ ఐక్యవేదిక ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల రేపు(బుధవారం) హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు చిగుళ్లపల్లి రమేష్, సురేష్‌శర్మ, రాజు, ముత్తారెడ్డిలు అన్నారు. వికారాబాద్ పట్టణంలోని రామ మందిరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని న్యూ గంజ్ హనుమాన్ ఆలయం నుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో హిందువులు, ఉద్యోగ సంఘాలు, అన్ని వర్గాల హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు చౌదరి యాదవరెడ్డి, బస్వలింగం, భక్తవత్సలం, విజయ్‌కుమార్, సదానందారెడ్డి, విద్యాసాగర్, నవీన్, యాదగిరి, శివరాజ్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.30లక్షలతో పార్కుల సుందరీకరణకు చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని పార్కుల సుందరీకరణకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.30లక్షలు ఖర్చు చేస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పాలకవర్గ సమావేశం సోమవారం నిర్వహించి మాట్లాడారు. రూ.75లక్షల సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున, శాశ్వత తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.16కోట్లతో ఇటీవలే శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిగి అభివృద్ధికి మరో రూ.25కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ.5కోట్లతో కార్యాలయ భవనం, రూ.20కోట్లతో వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. పరిగిని జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా మారుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్ చైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి లక్ష విరాళం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి స్థానిక బీఏఎం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగరాజు లక్ష విరాళం ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌కు చెక్కును ఇచ్చారు. పూర్తి సౌకర్యాలతో నిర్మిస్తున్న భవన నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన నాగరాజును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు శివశంకర్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్

మేడ్చల్ టౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్ డిమాండ్ చేశారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆశావర్కర్లతో కలిసి బీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంభు ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశావర్కర్లకు ప్రతీనెల చెల్లించాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ల సమస్యలను విస్మరిస్తే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్టీయూ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు హిందూ ఐక్యవేదిక ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల రేపు(బుధవారం) హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు చిగుళ్లపల్లి రమేష్, సురేష్‌శర్మ, రాజు, ముత్తారెడ్డిలు అన్నారు. వికారాబాద్ పట్టణంలోని రామ మందిరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని న్యూ గంజ్ హనుమాన్ ఆలయం నుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో హిందువులు, ఉద్యోగ సంఘాలు, అన్ని వర్గాల హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు చౌదరి యాదవరెడ్డి, బస్వలింగం, భక్తవత్సలం, విజయ్‌కుమార్, సదానందారెడ్డి, విద్యాసాగర్, నవీన్, యాదగిరి, శివరాజ్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్త విషయాలు తెలుసుకొని బోధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుప్రీతి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు కొత్త విషయాలను తెలుసుకుని విద్యార్థులకు బోధించాలని జేఎన్టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డక్టర్ సుప్రీతి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్‌పై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఐతో రోజుకో కొత్త మార్పు చోటుచేసుకుంటున్నందున విద్యార్థులకు బోధించే అధ్యాపకులు సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను అధ్యాపకులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ ఎ.మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం. వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం, డీన్ డాక్టర్ రాము పాల్గొన్నారు.

హైవేపై పవర్ బ్లింకర్ ఏర్పాటు



పవర్ బ్లింకర్‌ను ప్రారంభిస్తున్న టోల్ మేనేజర్ ఇబ్రహీం, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సోమవారం పవర్ బ్లింకర్‌ను ఏర్పాటు చేశారు. రాయ్‌కల్ టోల్ ప్లాజా సమీపంలో రామేశ్వరం ఆలయానికి వెళ్లే జంక్షన్ వద్ద టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి బ్లింకర్‌ను సోమవారం ప్రారంభించారు. జంక్షన్ వద్ద ప్రమాదాలు జరుగుతాయని, వాటిని నివారణకు వాహనదారులను అప్రమత్తం చేసేలా బ్లింకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది భానుప్రకాశ్, విశ్వనాథ్‌రాజు, బిజోయ్‌బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ నర్సయ్య

చౌదరిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో నిత్యం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య అన్నారు. సోమవారం కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సీసీ కెమెరాలు, సైబర్ క్రైంపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. యువత ఆన్‌లైన్ గేమ్‌లకు, వ్యసానాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలను నివారించొచ్చని సూచించారు. ప్రతొక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణ, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తుర్కపల్లిలో పీహెచ్‌సీ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కపల్లి గ్రామంలో నూతనంగా ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి(పీహెచ్‌సీ)ని ప్రారంభిస్తున్నట్లు మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో తుర్కపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి మంజూరైనట్లు తెలిపారు. తుర్కపల్లికి ఈనెల 4న బుధవారం ఉదయం 11గంటలకు రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితర నాయకులు విచ్చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.



జాగింగ్ చేస్తున్న వాకర్స్

నడుద్దాం.. రోగాలను జయిద్దాం

మారుతున్న జీవనశైలితో నడకకు ప్రాధాన్యం

- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ



కొడంగల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కాలంలో టెక్నాలజీ పెరిగి మానవాళికి శారీరక శ్రమ తగ్గింది. దీంతో అనేకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మానసిక ఆందోళన, ఒత్తిడి వంటివి జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. మారుతున్న జీవన శైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్యనిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు. రెండేళ్లపాటు మరణమృదంగం వాయించిన కొవిడ్ మహమ్మారి సైతం ఆరోగ్యం పట్ల హెచ్చరికలు జారీచేసి వెళ్లింది. ఈ అనుభవంతో ప్రజల్లో కాస్త మార్పు వచ్చింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి పరిమితిని బట్టి నడిచేస్తున్నారు. వయస్సుకు సరిపడా అడుగులు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఉదయం, సాయంత్రం నడక

ఉదయం నడక, సూర్యరశ్మితో ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పట్టణవాసులు సూర్యుడు ఉదయించక ముందే క్రీడాప్రాంగణాలు, ఖాళీమైదానాలు, గ్రామాల్లో ఊరి పొలిమేర వరకు చకచకా నడిచేస్తున్నారు. ఉదయం వేళ కుదరని వారు మాత్రం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాకింగ్‌కు సమయాన్ని కేటాయిస్తున్నారు. కొడంగల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల మైదానం వాకర్స్‌కు వేదికగా మారింది. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు. పాఠశాలల మైదానాలే కాక జాతీయ రహదారి వెంబడి వాకర్స్ సంఖ్య పెరుగుతోంది.

నడకతో ప్రయోజనాలివే

క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్స్ అనే హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు అంశాలను అధిగమించవచ్చు. గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరిచేరవు. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పనిచేస్తాయి. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది. కీళ్లు, కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందుకు పూర్తిస్థాయిలో సమతుల్యత తీసుకవస్తుంది. శరీరంలోని అధిక కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది. శరీరానికి మంచి శ్వాస, అధికస్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది. ఎముకలు ధృడంగా తయారవుతాయి. మానసికంగా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇస్తుంది. రక్తంలోని కొవ్వు కరుగుతుంది. విటమిన్ డి లోపం ఉండదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

నడక జీవిత కాలాన్ని పెంచుతుంది



30 సంవత్సరాలు దాటిన వారంతా నడకను దినచర్యగా పెట్టుకోవాలి. నడక వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో గుండె సంబంధింత జబ్బులు దరిచేరవు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు ధృడంగా మారుతాయి. **- కె.నర్సిరెడ్డి, వాకర్, కొడంగల్**

వాకింగ్‌తో ఉల్లాసం



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతీ ఒక్కరు వాకింగ్ చేయాలి. వాకింగ్‌తో బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావు. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్దకంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. **- కె.నర్సింహులు, వాకర్, కొడంగల్**

నస్కల్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ



నస్కల్ పంచాయితీ కార్యాలయంలో విచారిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నస్కల్ పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై సోమవారం డీఎల్‌పీవో సంధ్యారాణి విచారణ జరిపారు. పంచాయితీ కార్యదర్శి పారూక్‌హుస్సేన్ నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో సోమవారం క్షేత్రస్థాయిలో నస్కల్ పంచాయితీ కార్యాలయానికి వచ్చి విచారణ జరిపారు. పంచాయితీలో నిధుల ఖర్చులకు సంబంధించి రికార్డులను సీజ్‌చేశారు. విచారణ నివేదిక డీపీవోకు అందజేస్తామని తెలిపారు.

కొడంగల్‌లో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగ సంఘం నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో రెండు రోజులు (మంగళ, బుధ) రిలే నిరాహాదీక్షలు చేయనున్నట్లు భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. పట్టణంలోని అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులకు 6వేల పింఛన్, బస్‌పాస్‌తో పాటు ప్రతీ బస్సులో ఐదు ప్రత్యేక రిజర్వేషన్ సీట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల బంధు కింద రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు.

దళితబంధు దేశానికే ఆదర్శం



దళితబంధు యూనిట్‌ను ప్రారంభిస్తున్న జైపాల్‌యాదవ్

కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాలలో మక్తమాదారానికి చెందిన శివ దళిత బంధు స్కీం రూ.10లక్షలతో చేపట్టిన యూనిట్‌ను సోమవారం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌లతో కలిసి జైపాల్ ప్రారంభించారు. యువత ఉద్యోగ, ఉపాధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమల్లో విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై విమర్శలు మాని పాలనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, హరిచంద్, శంకర్, గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, మహేందర్, చందు, చెన్నయ్య పాల్గొన్నారు.

సేవలను బట్టే కీర్తి

సేవలను బట్టే సమాజంలో గౌరవం లభిస్తుందని జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.51వేలు సమకూర్చారు. సోమవారం జైపాల్‌తో కలిసి ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ సంఘం నాయకులకు చెక్కు అందజేశారు. చేయూతనిచ్చిన దశరథ్‌ను జైపాల్, సంఘం నాయకులు సత్కరించారు. చారిటబుల్ ట్రస్ట్‌తో దశరథ్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గంప వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, కానుగుల లక్ష్మయ్య, సత్యం, శివ, మహేందర్, జంగయ్య, వెంకటేశ్, శ్రీను, మురళి, శంకరయ్య, మహేశ్, నర్సింహ, లాయక్ అలీ, మధు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రెవెన్యూ కార్యాలయానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా, ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నందిగామలో నూతనంగా తహసీల్దార్ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని ఆయన స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 8ఏళ్లలో మండలంలో ఒక్క కార్యాలయాన్నైనా నిర్మించలేదన్నారు. నందిగామలో అన్ని వసతులతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. త్వరలోనే రెవెన్యూ ఆఫీసు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలు, నాయకులు కృష్ణ, బాల్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, డి.కుమార్‌గౌడ్, రాజగోపాల్, సి.నర్సింలు, కె.వెంకట్‌రెడ్డి, వై.శ్రీకాంత్‌గౌడ్, రవీందర్, సుమన్, బి.నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆమనగల్లు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

హాజరుకానున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, దామోదర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి



గీత



భాస్కర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం కొలువుదీరనుంది. కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10గంటలకు ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం ఉంటుంది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లానర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సోమవారం తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం లక్ష్మీ గార్డెన్‌లో సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, డైరెక్టర్ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణనాయక్ పరిశీలించారు.

భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)దేనని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించాడు. కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పరిశీలనకు ప్రత్యేక కమిటీ

- వసతి గృహాల్లో ఆహారం కలుషితం కాకుండా చర్యలు
- రాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ) ఏర్పాటు



రాపిడ్ రెస్పాన్స్ కమిటీతో సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వ వసతి గృహాల్లో కలుషిత ఆహారం కారణంగా పలువురు విద్యార్థులు అనారోగ్యాల బారినపడి ఆస్పత్రుల పాలయ్యారు. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అధికారులు వసతి గృహాలను సందర్శించడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వంటగది శుభ్రతలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా అధికారులు వసతి గృహాల బాట పట్టారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో ప్రతీ రోజు అదనపు కలెక్టర్ విజయేందర్ నేతృత్వంలో అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను సందర్శిస్తూ చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ గౌతమ్ రాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ) పేరుతో జిల్లాలో కలుషిత ఆహారానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తుంది.

మండలానికో ప్రత్యేకాధికారి..

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే తాగునీరు, భోజనం నిర్వహణపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీకి అదనపు కలెక్టర్‌ను చైర్మన్‌గా నియమించగా, మండలాలకు మాత్రం మండలానికో ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టనున్నారు. మండల ప్రత్యేకాధికారులు వసతి గృహాల్లో ఏదైనా సమస్యలున్నట్లు గుర్తిస్తే వెంటనే జిల్లాస్థాయి కమిటీకి సమాచారం అందిస్తారు. సమస్యకు సంబంధించిన జిల్లా కమిటీలోని సదరు అధికారి తనిఖీలు చేపడతారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించేందుకు ఆహార భద్రతా అధికారులతో మరో కమిటీని ఏర్పాటు చేశారు.

జిల్లా కమిటీలో అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు

జిల్లా కమిటీలో వసతి గృహాలకు సంబంధమున్న అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. చైర్మన్‌గా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సభ్యులుగా డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, జిల్లా ఆస్పత్రి సభ్యురాలు సునీత, డీఈవో విజయకుమారి, గురుకుల్ పాఠశాలల కమిషనర్ రజనీకాంత్, గిరిజన సంక్షేమాధికారి వినోద్, ఫుడ్ సేఫ్టీ అధికారి మల్లీశ్వరీలు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లో పనిచేయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో కలుషితమైన ఆహారానికి అడ్డుకట్టవేసేందుకు ఈకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యూహాలను రూపొందించి ఆచరణలో పెట్టనున్నారు.

ఆహారం కలుషితం కాకుండా చర్యలు



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహార విషపూరిత ఘటనలను సమర్థవంతంగా నివారించేందుకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు. మండలానికో ప్రత్యేకాధికారి ద్వారా సమాచారం తెలుసుకుని కమిటీ రంగంలోకి దిగుతుంది. కమిటీలోని అధికారులందరూ సమన్వయంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఎలాంటి సంఘటనలు జరుగకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకుంటారు. **- విజయేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్**

తాగునీటి పైప్‌లైన్లలో పేరుకుపోతున్న ఫ్లోరైడ్

● కృష్ణా నీటిలో బోరు నీరు కలిపి సరఫరా


చౌదర్‌పల్లిలో పైప్‌లైన్‌లో బయటపడ్డ ఫ్లోరైడ్

యాచారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరందించేందుకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న కృష్ణా నీటిలో బోర్ నీటిని కలుపుతుండడంతో జనం ఫ్లోరైడ్ నీరు తాగుతూ రోగాలబారిన పడుతున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను కల్వకుర్తి నుంచి ఆమనగల్లు మీదుగా కందుకూరు మండలం ముచ్చర్ల వద్ద రిజర్వాయర్‌లో శుద్ధిచేసి యాచారం, కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాలకు సరఫరా చే స్తున్నారు. నీటి సరఫరా లోప భూయిష్టంగా మారడంతో కృష్ణానీరు సరిపోక వాటర్‌మెన్ కృష్ణానీటిలో గ్రామాల్లోని బోర్ నీరు కలిపి సరఫరా చేస్తున్నారు. బోర్ నీటితో పైపుల్లో ఫ్లోరైడ్ పేరుకుపోయి గడ్డకట్టి నీటి సరఫరా నిలుస్తోంది. దాంతో చాలీచాలని నీటితో జనం ఇబ్బందులుపడుతున్నారు. చౌదర్‌పల్లిలో పైప్‌లలో ఫ్లోరైడ్ పేరుకొని నీరు రావడం లేదని గ్రామస్తులన్నారు. తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న,వాటర్ మ్యాన్ మైసయ్య బీసీ వాడలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయగా ఫ్లోరైడ్ గడ్డలు బయటపడ్డాయి.


పైపుల నుంచి తీసిన ఫ్లోరైడ్

స్వచ్ఛమైన కృష్ణా నీటినందించాలి



కృష్ణా నీటిలో బోర్ నీటిని కలిపి సరఫరా చేస్తుండడంతో ఫ్లోరైడ్ నీటినీ తాగుతున్నాం. మాకు స్వచ్ఛమైన కృష్ణా నీటినే అందించాలి. మిషన్ భగీరథ అధికారులు కృష్ణా నీటిని మరింత పెంచి సరఫరా చేయాలి. బోర్ కనెక్షన్లను నీటి సరఫా పైపులకు కలపకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- ఎన్.కృష్ణ, చౌదర్‌పల్లి

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

షాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గ్యారంటీల పేరిట 420 హామీలిచ్చిందని బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... అధికారంలోకొచ్చి గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ పూర్తి చేశామని చెబుతూ రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో పీఎం నరేంద్రమోదీ సహకారంతో మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధిపై కాకుండా దోచుకోవడంపై మాత్రమే దృష్టిపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, రాము, మహేందర్,మాణయ్య,సతీష్‌రెడ్డి, గోపాల్, రాజీవ్‌రెడ్డి, మహేష్, నారాయణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్

క్రైం కార్నర్

ఆరు మట్టి టిప్పర్ల సీజ్

యాచారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):చౌదర్‌పల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను ఆదివారం రాత్రి సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామని యాచారం సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు. రాత్రి వేళ పలు గ్రామాల నుంచి ఎర్రమట్టి తరలిస్తున్నట్లు సమాచారమందడంతో తమ సిబ్బంది దాడి చేసి టిప్పర్లను పట్టుకున్నారని ఆయన చెప్పారు. మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టుకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాడ్గుల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తుర్కలయంజాల్‌లోని లార్డ్స్ హైస్కూల్ నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఇర్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు రెండో సారి ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎల్.పర్వతాలు సోమవారం తెలిపారు. ప్రతిభాపాటవ పోటీలను తెలుగు, ఇంగ్లిష్ మీడియం, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు వేర్వేరుగా నిర్వహించారని తెలిపారు. తెలుగు మాధ్యమం నుంచి ఇర్విన్ విద్యార్థి రోహిత్, సాకేత్, శివకుమార్ ప్రథమ స్థానంలో, ఆంగ్ల మాధ్యమంలో వైష్ణవి, లహరిక, శివకుమార్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరు డిసెంబరు 13, 14, 15 తేదీల్లో జేవీవీ అదిలాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ విద్యార్థులకు హెచ్‌ఎం పర్వతాలు, గైడ్ బాల్‌నాయక్, ఉపాధ్యాయులు స్కూల్‌లో అభినందించారు.

ప్రజలకు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

యాచారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, భూగర్భ డ్రైనేజీ, మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండల పరిషత్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. అతిసార, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను రోజూ పంచాయతీ సిబ్బందితో, వాటర్ ట్యాంకులను ప్రతీ వారం శుభ్రం చేయాలన్నారు. నీటి ఎద్దడితో చౌదర్‌పల్లి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే సమస్య తీర్చాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. మురుగు కాలువలు, డ్రైనేజీల నుంచి తొలగించిన మట్టిని తక్షణమే గ్రామానికి దూరంగా వేయించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వడ్డనను తరచూ పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నాణ్యమైన భోజనమందేలా చూడాలన్నారు. హరితహారం నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధి హామీ, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ అయ్యప్ప, ఏవో సందీప్‌కుమార్, ఏపీవో లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి


అంబేడ్కర్, భగత్‌సింగ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశం కోసం, జాతి ఉదద్ధిరణకు మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలందిస్తోందని అన్నారు. కడ్తాలలో నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్, కొత్తగా నిర్మించిన అంబేడ్కర్, భగత్‌సింగ్ విగ్రహాల ఆవిష్కరణకు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వేర్వేరుగా హాజరయ్యారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య అధ్యతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలు, పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని దేశం కోసం పాటుపడాలన్నారు. రాజ్యాంగ ఫలాలు పేదలందరికీ అందాలనే సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టారన్నారు. కుల గణన లెక్కలే తేలిన తరువాత సామాజిక వర్గాల వారీగా అన్ని వర్గాలకు తగిన వాటా కల్పిస్తారన్నారు. అంబేడ్కర్ ఆలోచనలు, భగత్‌సింగ్ ఆశయసాధనకు యువత కృషి చేయాలన్నారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు పేదలకు చేరితేనే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్, నాయకులు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, చేగూరి వెంకటేశ్, ఎర్రోళ్ల రాఘవేందర్, బిచ్యానాయక్, యాదగిరిరెడ్డి, జహంగీర్ అలీ, లాయక్‌అలీ, ఎం.నర్సింహ, లక్ష్మయ్య, జహంగీర్ అలీ, రామకృష్ణ, మాధవులు, వెంకటేశ్, మల్లయ్య, దాసు, రాజేందర్‌యాదవ్, శ్రీనివాస్, మహేందర్, అంజయ్య, జంగయ్య, నర్సింహ, శివ, వెంకటేశ్, మురళి, శ్రీను, శంకరయ్య, సత్తయ్య, చరణ్, మురళీకృష్ణ, గోపాల్, గణేశ్, వినోద్, కరుణాకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకుచెందిన 14మందికి రూ.3.23 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్వోసీలను హైదారాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలకు ప్రభుత్వం రూ.10లక్షల వరకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు జంగయ్య, కొండల్‌రెడ్డి, సాయిరెడ్డి, రవీందర్, జగన్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం

మాడ్గుల: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల మొదటి రోజు విద్యాదినోత్సవ సంబరాల్లో భాగంగా మాడ్గుల మండలంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వతిహించారు. విజేతలకు బహుమతులు అందచేసే కార్యక్రమానికి అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ, అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ సూదిని పద్మారెడ్డి, ఎమ్మెల్యే నారారాయణరెడ్డి హాజరయ్యారు. వారిని ఎంఈవో సర్దార్ నాయక్, ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతొక్కరు విద్యావంతులు అయితేనే పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యం అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషన్‌నెడ్డి, పీసీసీ మెంబర్ బాలాజీసింగ్, వెంకటేశ్వర్లుగౌడ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జగన్‌గౌడ్, రమేష్‌గౌడ్, రాములు హెచ్‌ఎం సుదర్శన్ పాల్గొన్నారు.

కార్తీక మాస భజన కీర్తనలు పూర్తి


భజన చేస్తున్న భక్తులు

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండంలోని పలు గ్రామాల్లో కార్తీకమాసంలో భక్తులు నిర్వహించిన భజన కీర్తనలు సోమవారంతో ముగిశాయి. కందుకూరు, కొత్తగూడ, జైత్వారం, నేదునూరు, మీర్ఖాన్‌పేట, దాసర్లపల్లి, దెబ్బడగూడ తదితర గ్రామాల్లో భక్తులు నెల రోజుల పాటు రోజూ వారి ఇళ్ల వద్ద భజన కీర్తనలు ఆలపించి పూజలు చేశారు. ఆదివారం అమావాస్యతో సోమవారం భక్తులు కార్తీక మాస భజన కీర్తనలను పూర్తిచేస్తూ గ్రామ వీధుల్లో భజనలతో ఆలయాలకు వెళ్లి పూజలను సంపూర్ణం చేశారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి రైతులు తరలిరావాలి


విలేకరులతో మాట్లాడుతున్న జగన్, కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ పాలకవర్గం ఈ నెల 4న ప్రమాణస్వీకారం చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10గంటలకు ఆమనగల్లు లక్ష్మీగార్డెన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేఖరులతో జగన్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు మల్లయ్య, విజయ్, ఖాదర్, బాబ, సురేశ్, మహేశ్, మైసయ్య, ఫరీద్, రాజు, శ్రీకాంత్, హరిలాల్, కరీం, ప్రసాద్, శ్రీను, రామస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలి



పింఛన్ పెంచాలని రిలే దీక్ష చేపట్టిన దివ్యాంగులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌ను ఆరు వేల రూపాయలకు పెంచాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను 6వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ వద్ద రిలే దీక్షకు పూనుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన భుజంగరెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం మేరకు దివ్యాంగులకు పింఛన్ పెంచాలని, ఇప్పుడిస్తున్న 4వేలు సరిపోవడం లేదని అన్నారు. రిలే దీక్షకు టీడీపీ నాయకులు మఠం శశిధర్, సీఐటీయూ నాయకుడు రాజులు మద్దతు తెలిపారు. అనంతరం షాద్‌నగర్ ఆర్డీవో సరితకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు జె.రాజు, శేఖర్‌గౌడ్, కృష్ణయ్య, రమేష్, సుగునయ్య, సంతోష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తీగలను కలిసిన నాయకులు

● పార్టీ పూర్వవైభవానికి కృషిచేయాలని వినతి

ఆమనగల్లు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డిని సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు కలిశారు. టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండెకార్ యాదిలాల్, నర్సింహల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టీకేఆర్ కళాశాలలో కృష్ణారెడ్డిని పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడి సమక్షంలో టీకేఆర్ టీడీపీలో చేరనున్న సందర్భంగా ఆయనను పార్టీలోకి స్వాగతించారు. రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం తేవాలని కృష్ణారెడ్డిని కోరారు. గ్రామీణ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు తిరిగి సొంతగూటికి చేరేలా చొరవ తీసుకోవాలని కృష్ణారెడ్డి వారిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కె.సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ పార్టీ కోశాధికారి ఎ.నర్సింహ,సీనియర్ నాయకుడు పంచాక్షరి, ఆమనగల్లు నాయకుడు గాజుల పద్మనాభం ఉన్నారు.



తీగల కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదిలాల్, నర్సింహ, సత్యం తదితరులు

రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ ఆదర్శం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులను దేశానికి తలమానికంగా నిలుపాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాల్గో విడత రూ.2,747కోట్ల రుణమాఫీని హర్షిస్తూ మైసిగండిలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. శ్రీనివాస్‌గౌడ్ హాజరై నాయకులు బిచ్యానాయక్, హీరాసింగ్‌లతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో రైతులు కష్టాల తొలగుతుంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు వాడకున్నా 66లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసి 1.5కోట్ల టన్నుల వడ్లు పండించడం ప్రజా ప్రభుత్వ ఘనతే అన్నారు. పనీపాట లేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్, రేవంత్‌రెడ్డిని విమర్శించడమే దినచర్యలో భాగంగా పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ ఉచ్చులో పడి ప్రజలు ఆగం కావొద్దని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. కార్యక్రమంలో తుల సీరామ్, కిషన్, వినోద్, రమేశ్, సుధీర్, చత్రు, సుమన్, నరేశ్, అమర్‌సింగ్, రాము, సునిల్ కుమార్, చందూలాల్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈకి సన్మానం



ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఏఈగా నియమితులైన శ్రీనివాస్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏఈని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ సత్కరించి అభినందించారు. ప్రజాసేవల్లో అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ దివ్యశ్రీకాంత్‌సింగ్, టి.విజయ్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌కో ఏడీఈగా రవీందర్


బాధ్యతలు చేపడుతున్న ఏడీఈ రవీందర్

కొత్తూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో కొత్తూర్ సబ్ డివిజనల్ ఏడీఈగా ఎం.రవీందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మేడ్చేల్ ఏడీఈగా పనిచేసిన రవీందర్ బదిలీపై కొత్తూర్ వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏడీఈ కె.రవీందర్ ఉప్పల్‌కు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఏడీఈని ఏఈ రమేష్‌గౌడ్, సిబ్బంది సన్మానించారు. నూతన ఏడీఈకి స్వాగతం పలికారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని నూతన ఏడీఈ అన్నారు.

కబళిస్తున్న కాలుష్యం

(7వ పేజీ తరువాయి)

మహేశ్వరం, మంఖాల్, ఇమాంగూడ, శ్రీనగర్ గ్రామాల్లో పంటలు పాడవుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలు మంఖాల్ చెరువులోకి చేరి నీరంతా కలుషితమవుతోంది. దీంతో అందులోని చేపలు ప్రతీ యేట చనిపోతున్నాయి. ఆ నీటిని పశువులు తాగలేకపోతున్నాయి. అంతే కాకుండా మహేశ్వరం వెళ్లే రోడ్డు పక్క నుంచి పరిశ్రమల ద్వారా బయటకొచ్చే మురుగుతో దుర్వాసన వస్తోంది. వాసన భరించలేక రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకుంటున్నారు. అయితే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమలు నిబంధనలు పాటించాలి



పరిశ్రమలు కాలుష్య నియంత్రణ బోర్డు నియమ నిబంధనలను తప్పక పాటించాలి. పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థాలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- అల్వాల రవికుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి



షాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పీసరి సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా బోడ చిన్నజంగయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా అక్తర్‌పాషా, గౌండ్ల నర్సింహులు, అంగోతు లలిత, బాలకృష్ణారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, కావలి రమేష్, కొత్త జైపాల్‌రెడ్డి, బి.సత్యనారాయణ నియామకం అయ్యారు.

జీఎం విత్తనాలను దేశంలో ప్రవేశపెట్టకుండా తీర్మానించాలి

షాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీఎం విత్తనాలను దేశంలో ప్రవేశపెట్టకుండా పార్లమెంట్‌లో తీర్మానించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్‌లో సంఘం సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విత్తనాల జెనెటికల్ మోడిఫికేషన్ వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. దేశంలో బీటీ వన్, బీటీ టూ, బీటీ త్రీ, బీటీ ఫోర్, బీటీ ఫైవ్ వంటి పత్తి విత్తనాలతో అనారోగ్యానికి గురైన సంఘటనలు ఉన్నాయన్నారు. బీటీ పత్తి విత్తన సాగులో గ్లైపొసెట్ కలుపు మందు వాడుతున్నారని గ్లైపొసెట్ అనేది క్యాన్సర్‌కు దారితీస్తున్నట్లు అనేక పరిశోధనలు వెల్లడించినట్లు తెలిపారు. వంకాయ, ఆవాలు లాంటి విత్తనాల్లో జీఎం ప్రవేశపెట్టి అధిక దిగుబడిని సాధించవచ్చునని విదేశీ కంపెనీలు నమ్మ పలుకుతున్నాయని అన్నారు. జెనెటికల్ మార్పింగ్‌తో చేసిన విత్తనాలతో పండిన పంటలు మాంసాహారమా, శాకాహారమా ఇప్పటికీ తేల్చలేదన్నారు. విత్తనాల ప్రవేశాన్ని ఆపేందుకు ఇప్పటికే అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పార్లమెంట్ సభ్యులకు వినతి ప్రతాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రయ్యగౌడ్, కార్యవర్గ సభ్యులు వీరేశం, శ్రీశైలం, నర్సింహులు, రైతులు మల్లారెడ్డి, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

మృతుల కుమారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శ


మృతుల కుమారులను పరామర్శిస్తున్న సబితారెడ్డి

శంకర్‌పల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): బీజాపూర్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మృతిచెందిన మేకల లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి కుటుంబీకులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సోమవారం పరామర్శించారు. ప్రొద్దటూరుకు చెందిన లక్ష్మారెడ్డి-భాగ్యలక్ష్మి దంపతులు ఆదివారం చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన కారు ప్రమాదంలో మృతిచెందగా వారి కుమారులు మనోహర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలను పరామర్శించారు. అనంతరం సబిత మాట్లాడుతూ బీజాపూర్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్డు వెడల్పు చేయడం, నేషనల్ హైవేగా మార్చడం, రోడ్డు మంజూరుకు ప్రతిప్రాదనలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డును పూర్తిచేయాలన్నారు. దంపతుల మృతి బాధాకరమన్నారు. వారి పిల్లలకు తల్లిదండ్రుల లోటు తీర్చలేనిదన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నర్సింహరెడ్డి, వెంకట్‌రెడ్డి. నర్సింహ, ఉపేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, మన్నె లింగం తదితరులు ఉన్నారు.

సొసైటీ రుణాల అందజేత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని గోల్కొండ వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బొమ్మ దవనకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వెంకటేశ్, కొత్తలక్ష్మారెడ్డి, మామిళ్ల కుమార్, కట్టా సురేందర్, శంకరయ్య అనే రైతులకు సొసైటీ ద్వారా దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు కింద మొత్తం రూ.18లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఏనుగు దేవేందర్‌రెడ్డి, మంచర్ల మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బాల్యనాయక్, రూప విజయలక్ష్మి, సీఈవో యాదయ్య, సిబ్బంది సురేశ్, ముధుమతి, జగపతిబాబు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో సోమవారం వినాయక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని భీమిడి అశోక్‌రెడ్డి అన్నదానం చేశారు. మొదటగా అయ్యప్ప స్వామికి పూజ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యేటా ఒక రోజు మాలధారులకు అన్నదానం చేస్తున్న అశోక్‌రెడ్డిని స్వాములు ఆశీర్వదించారు. అలాగే శివమారుతి గీతా అయ్యప్ప మందిరం కమిటీ అధ్యక్షుడు లష్కర్ అంజనేయులు, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్‌లు అభినందించారు.

దైవ కార్యక్రమాలతో సమాజ శాంతి

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందొచ్చని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం చేస్తాయన్నారు. ఆమనగల్లు సమీపంలోని అంతిరింతిరి కొండపై ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాసం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఆచారి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణయాదవ్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు గుర్రం కేశవులు, యాదయ్య, పాండు, భాస్కర్, కృష్ణయ్య, మల్లేశ్, అల్లాజీ, స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

తలకొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబాలను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్తంగా

● **కడ్తాల్:** అధైర్య పడొద్దు అండగా ఉంటామని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ అన్నారు. నిరుపేద, బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కడ్తాలకు చెందిన కేశని సత్యమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్‌లతో కలిసి వెంకటేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి వెంకటేశ్ గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు జైపాల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నర్సింహ, యాదయ్య, లాయక్ అలీ, మహేశ్, దశరథం, జంగయ్య, వెంకటేశ్, శ్రీను, శ్రీరామ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం:**ముఖ్యమంత్రి కప్ 2024 గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటల పోటీలను నిర్వహించాలని సోమవారం ఎంపీడీవోలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 7,8 తేదీల్లో గ్రామస్థాయి పోటీలు, ఈ నెల 10,11,12 తేదీల్లో మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, బాస్కెట్ బాల్, నెట్ బాల్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, స్నూకర్, జూడో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు.

● **యాచారం:** మండల మాదిగ ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం ఎంపిక చేశామని సంఘం రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ తెలిపారు. అధ్యక్షుడిగా జంగయ్య, గౌరవాధ్యక్షుడు ఎం.యాదయ్య, ఉపాధ్యక్షుడు ఎలీషా, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కార్యదర్శులు కె.యాదయ్య, కె.ఎల్లయ్య, ఎంపికయ్యారని తెలిపారు.

● **కేశంపేట:** ప్రజలకు ఉచిత విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కేశంపేట మండల ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ డిమాండ్లను అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హమీలతో పాటు విద్యా, వైద్యం, ఉపాధి, భూమిచ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రాకేష్, మల్లేష్, రమేష్, శివ, రవి, ఆనంద్, రమేశ్‌గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● **ఆమనగల్లు:** బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గుత్తి బాలస్వామి జన్మదిన వేడుకలు ఆమనగల్లులో నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.